

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు

- బోనం, పట్టు వస్త్రాలు అందజేత
- పాల్గొన్న మంత్రి పొన్నం, కలెక్టర్ హరిచందన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ శ్రీఉజ్జయిని మహంకాళి అమ్మవారికి శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు బోనం, పట్టువస్త్రాలు సమర్పించారు. వారి వెంట రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హరిచందన దాసరి ఉన్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 13న ఉజ్జయిని మహంకాళి బోనాలు, 14న రంగం ఉండటంతో లక్షలాది మంది జనం వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ.. పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రద్దీ దృష్ట్యా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై సందర్శకులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. నిరంతర విద్యుత్, తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, లైన్‌లో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వచ్చిన వారందరికీ అమ్మవారి దర్శనం కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు, డిసిపి రష్మీ పరిమల్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి, ఆలయ చైర్మెన్ సురిటి రామేశ్వర్, ఈవో మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నగర వాసుల వద్దకు వెళుతున్న బిఆర్ఎస్ నాయకులు

ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇచ్చిన హామీని
రేవంత్ నిలబెట్టుకోవాలి : బిఆర్ఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ స్పీకర్ మధుసూధనాచారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలిలోని గోపన్‌పల్లి బసవతారక నగర్ వాసులను బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రియల్ మాఫియా పెద్దలు ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే బసవతారక నగర్ కాలనీ వాసులను ఖాళీ చేయించడానికి గుండాలను పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బసవతారక నగర్ కాలనీని సందర్శించి వారికి 60 గజాల స్థలం ఇస్తామని హామీనిచ్చారని, ఆ హామీకి కట్టుబడి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. బసవతారక నగర్ పక్కనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. లేకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భద్రాచలం వద్ద 40 అడుగులకు 'గోదావరి'

- మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



గత 15 రోజులుగా క్రమక్రమంగా పెరుగుతూ, తగ్గుతూ ఉన్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గోదారమ్మ రెండు రోజుల నుంచి మాత్రం క్రమంగా పెరుగుతూ 40 అడుగులకు చేరుకోగా 6,20,470 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రికి 43 అడుగులతో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరుకునే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు గోదావరిలోకి వచ్చి చేరుతోంది. 43 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకి రెండవ ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేస్తారన్న విషయం తెలిసిందే. అంతకంతకు పెరుగుతున్న గోదావరి వరద నేపథ్యంలో రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉంటున్నారు. ఎస్‌పి రోహిత్ రాజ్ కరకట్ట స్లూఈజ్‌లను పరిశీలించి, ఎటువంటి పరిస్థితులైన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు.

బిసిల ఉద్యమంతో ప్రభుత్వంపై ఒత్తిడి

- మాజీ మంత్రి తలసాని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసిల ఉద్యమంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అసెంబ్లీలోనూ బయటా బిఆర్ఎస్ తరపున పోరాడామని గుర్తు చేశారు. గవర్నర్ ద్వారా కేంద్రానికి బిల్లు పంపినప్పటికీ దాన్ని బైపాస్ చేస్తూ ఆర్డినెన్స్ తీసుకొస్తామని సిఎం చెబుతున్నారని తెలిపారు. గత అనుభవాల నేపథ్యంలో దీనిపై కొన్ని అనుమానాలున్నాయని గుర్తు చేశారు. ఆ అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ బిసిల ఓట్లు కొల్లగొట్టేందుకే 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చారని తెలిపారు. కేబినెట్ నిర్ణయాన్ని పరిశీలిస్తే ఇందులో ద్రోహంతో కూడిన కుట్ర కనిపిస్తోందని అనుమానాన్ని వ్యక్తం చేశారు. మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రేవంత్ సర్కార్ బిసిలను ఘరానా మోసం చేస్తున్నారని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. మాజీమంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ బిసిల మనోభావాలు దెబ్బతినేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీలో చర్చ సమయంలోనే తమకున్న అనుమానాలు వ్యక్తం చేశామని గుర్తు చేశారు. ఆర్డినెన్స్ ద్వారా రిజర్వేషన్లు కల్పించే అవకాశం ఉంటే 20 నెలలు ఎందుకు ఆలస్యం చేశారని ప్రశ్నించారు.. బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

గుల్జార్ హౌజ్ మృతుల కుటుంబాలకు
నష్టపరిహారం మంజూరు చేయాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో గుల్జార్ హౌజ్‌లో అగ్ని ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ.85 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. మే 18న జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. వారికి ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి విడుదల చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు సహాయాన్ని విడుదల చేస్తూ రెవెన్యూశాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అగ్ని ప్రమాదంలో 21 మంది చిక్కుకోగా నలుగురు మాత్రమే బయటపడగా మిగిలిన వారు ప్రాణాలు కోల్పోయారు.

కల్తీ కల్లు ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- డ్రగ్స్ లాగే కల్తీ కల్లుపై ఉక్కుపాదం మోపాలి
- పట్నం రాష్ట్ర నాయకులు డిజి.నర్సింహారావు
- సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఆఫీస్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్తీ కల్లు ఘటనపై కఠిన చర్యలు చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలను ఆదుకోవాలని పట్నం రాష్ట్ర నాయకులు డిజి నర్సింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ప్రమాద ఘటనలో ఇప్పటివరకు పలువురు మృతిచెందారని, మరికొంత మంది చికిత్స పొందుతున్నారని, అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఈ ఘటన చాలా తీవ్రమైనదన్నారు. కల్లు కాంపౌండ్ల యజమానులు కొందరు లాభాపేక్షతో రసాయనాలతో కల్లును తయారు చేసి ప్రజల ప్రాణంతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగానూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నారన్నారు. పేదల మరణాలకు కారణమైన యాజమాన్యాలను హత్యానేరం కింద కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు కల్లు కాంపౌండ్లలో తనిఖీలు చేసినట్టయితే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. సంబంధిత అధికారులపైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరంతరం తనిఖీలు చేసేలా ఆదేశాలివ్వాలన్నారు.

సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ లాగే కల్తీ కల్లుపై ఉక్కుపాదం మోపాలన్నారు. అన్ని కల్లు దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. బాధితులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. జిల్లాలో కల్తీ మద్యంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేష్, కోట రమేష్, ఎస్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, సిపిఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్ర అశోక్, జి.శ్రీనివాసులు, రాజశేఖర్, నాయకులు రాథోడ్ సంతోష్, ఎన్.శ్రీనివాస్, లింగస్వామి, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు వెంకట నర్సయ్య, మహిళ సంఘం నాయకులు మంగ, విజయ, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి జావిద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం

- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- దేశంలో సన్న బియ్యం పంపిణీని మించిన పథకం లేదు
- మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేస్తుందని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈనెల 14న సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సిఎం చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభ సభ జరగనుంది. ఆ బహిరంగ సభ ఏర్పాట్లపై శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సుధీర్‌రెడ్డితో కలిసి తిరుమలగిరిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. బిసిలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం చట్టం తెచ్చామని తెలిపారు. ప్రజల కోరిక మేరకు ఎస్‌సి వర్గీకరణ చేశామని, బిసి కులగణన, ఎస్‌సి వర్గీకరణ అనే రెండు క్యాబినెట్ సబ్ కమిటీలకు చైర్మన్‌గా తానే వ్యవహరించానని తెలిపారు. ఈ నెల 14న ఐదు లక్షల కొత్త రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామన్నారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. దేశంలో సన్న బియ్యం పంపిణీని మించిన సంక్షేమ పథకం ఎక్కడా లేదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గం బిఎన్ఆర్ లాంటి గొప్ప వీరులు జన్మించిన గడ్డ అని, ఈ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు.

ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. గత పాలకులు పేదల సంక్షేమం కోసం ఏ పథకం చేయలేదని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, ఈ నెల 14న మధ్యాహ్నం మూడు గంటలకు సిఎం చేతుల మీదుగా జరిగే నూతన రేషన్ కార్డుల పంపిణీ సభను అందరూ సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అవకాశం ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్, జిల్లా ఎస్పి కె నరసింహ, అదనపు కలెక్టర్ పి రాంబాబు, డిఆర్‌డిఒ అప్పారావు, డిఎస్‌ఒ సతీష్ కుమార్, డీఎస్‌ఒ మెహన్‌బాబు, ఆర్‌డిఒ వేణు మాధవరావు, తహసీల్దార్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

సిఎం రేవంత్ రెడ్డికి బిసి సంఘాల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ఆ సంఘం నేతలు శుక్రవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డిని కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సిఎంను కలిసిన వారిలో కృష్ణయ్యతో పాటు మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులున్నారు.



సిజెఐ జస్టిస్ గవాయ్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పర్యటనకు వచ్చిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌కు శుక్రవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌తో పాటు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ పగిడిగంటం నర్సింహాలకు రాష్ట్ర హై కోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి, ఎజి సుదర్శన్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

సాగర్ డ్యాం గేట్లను తాకిన కృష్ణా జలాలు

- విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన జెన్కో అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కృష్ణా జలాలు శుక్రవారం సాయంత్రం నాగార్జునసాగర్ డ్యాం క్రస్ట్ గేట్లను తాకాయి. జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, 546 అడుగుల వద్ద డ్యామ్ గేట్లను అమర్చారు. శుక్రవారం సాయంత్రానికి నీరు 546 అడుగులను దాటిపోవడంతో క్రస్ట్ గేట్లను చేరుకుంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ జలాశయంలోకి శ్రీశైలం నుంచి 1,24800 క్యూసెక్కుల నీరు వస్తుండగా, దిగువకు 5244 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాలుగు రోజులుగా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా ఖమ్మం జిల్లా పాలేరు జలాశయానికి విడుదల చేస్తున్న నీటిని శుక్రవారం తెల్లవారుజామున డ్యామ్ అధికారులు నిలిపివేశారు. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ఈ కారణంగా 4144క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో సాగర్ జలాశయంలో రోజుకు నాలుగు అడుగుల చొప్పున పెరుగుతూ వస్తోంది. మరో పది రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు చేరుకునే అవకాశం ఉంది.

ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన జెన్కో సిఎండి

నాగార్జునసాగర్‌లోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రాష్ట్ర జెన్కో సిఎండి హరీష్, రాష్ట్ర పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి నవీన్ మిట్టల్ నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించారు. యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను పరిశీలించిన అనంతరం సాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహానికి వచ్చిన వారికి జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ స్వాగతం పలికారు. అనంతరం సాగర్ జలాశయాన్ని పరిశీలించారు. విజయ విహార్‌లో స్థానిక శాసనసభ్యులు జైవీర్‌రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. తరువాత పైలాన్ కాలనీలోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. మరమ్మతులు నిర్వహిస్తున్న మొదటి టర్బన్ పనులను పరిశీలించారు. విద్యుత్ కేంద్రం అంతర్భాగంలో ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించిన అనంతరం కంట్రోల్ రూమ్‌లో అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట హైడల్ డైరెక్టర్ బాలరాజు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జెన్కో చీఫ్ ఇంజనీర్ మంగేష్ కుమార్, ఎస్ఐ రఘురాం, సాగర్ సిఐ శ్రీను నాయక్, జెన్కో సిఐ నాయుడు, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ప్రొటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి, సాగర్ ఎస్ఐ ముత్తయ్య ఉన్నారు.

'పాలమూరు-రంగారెడ్డి' కి రూ.22.13 కోట్ల యాడ్స్ ఏంటి?

- గవర్నర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దక్షిణ తెలంగాణను సస్యశ్యామలంగా మార్చే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పలు కారణాలతో నేటికీ పెండింగ్‌లో ఉందనీ, అలాంటి దానిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల లబ్ది కోసం రూ.22.13 కోట్ల ప్రజాధనాన్ని యాడ్ల రూపంలో పత్రికలకు ఇవ్వడాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎం పద్మనాభరెడ్డి తప్పుబట్టారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు నార్లపూర్‌లో ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున పత్రికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చిందని తెలిపారు. 13 తెలుగు, ఏడు ఇంగ్లీష్, మూడు హిందీ, ఆరు ఉర్దూ, రెండు మరాఠి పత్రికలతో పాటు 296 చిన్న పత్రికలు, 322 మ్యాగజైన్లకు రూ.22.13 కోట్లను కెసిఆర్ ప్రభుత్వం యాడ్ల రూపంలో ఇచ్చిందని తెలిపారు. ఇది ఎన్నికల్లో లబ్ది పొందడానికి ఇచ్చినట్టుగా ఉందని విమర్శించారు. 2022లో బిఆర్ఎస్‌ను కెసిఆర్ జాతీయ పార్టీగా ప్రకటించారనీ, ఆయా రాష్ట్రాల్లో గుర్తింపు కోసం తెలంగాణలో జరుగుతున్న సంక్షేమ పథకాల పేరుతో దేశంలోని అన్ని పత్రికలకు అప్పటి ప్రభుత్వం యాడ్లు ఇచ్చిందని గుర్తుచేశారు. ఒక్క 2022 సంవత్సరంలోనే 244.17 కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. తెలుగే కాకుండా ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, మలయాళం, తమిళం, మరాఠి, ఒరియా, గుజరాతి, బెంగాలి, పంజాబీ ఒక్కటేమిటి దేశంలోని అన్ని చిన్న, చితకా పత్రికలలో కూడ ప్రకటనల్విడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొత్త రేషన్ కార్డులు 14 నుంచి పంపిణీ

- తుంగతుర్తిలో లాంఛనంగా ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీకి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 14న తుంగతుర్తి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.4 లక్షల కొత్త రేషన్ కార్డులను ఇవ్వనున్నారు. వీటితో అదనంగా 11.30 లక్షల మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరనుంది. గడిచిన ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్ పంపిణీ చేసింది. కొత్తగా జారీ చేసిన రేషన్‌కార్డులతో కలిపి రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 94,72,422 కు చేరను ంది. మొత్తంగా 3.14 కోట్ల మందికి లబ్ది చేకూరనుంది. ప్రస్తుతం రేషన్ కార్డుల్లో ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున బియ్యాన్ని అందిస్తున్నది. అర్హులైన వారి నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనను ఈ నెల 13 వరకు పూర్తి చేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి తెల్ల రేషన్ కార్డుల సంఖ్య 89.73 లక్షలుంది. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వీటికి అదనంగా 49 వేల తెల్ల రేషన్ కార్డులను జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో 2.81 కోట్ల మందికి దొడ్డు బియ్యం సరఫరా చేసేందుకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేసేది. అయితే కార్డుల సంఖ్య పెంచడంతో పాటు తెల్ల రేషన్ కార్డులకు సన్న బియ్యం సరఫరా చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఖర్చు రూ.13 వేల కోట్ల వరకు పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

దేశ ప్రజలను కలిపే భాష హిందీ : కిషన్‌రెడ్డి

హైదరాబాద్ బ్యూరో : దేశ ప్రజలను కలిపే భాష హిందీ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో రాజ్య భాషా విభాగం స్వర్ణ జయంతి సమారోహ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాను తెలుగుకు వ్యతిరేకం కాదని అన్నారు. కొందరు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందీని వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. దక్షిణ భారత ప్రజలు మాత భాషతో పాటు హిందీలో మాట్లాడాలని సూచించారు. అన్ని భారతీయ భాషలు ఎంతో సుందరమైనవని కొనియాడారు. ప్రతి పుష్పాన్ని వివిధ భాషలుగా పోల్చుకుంటే ఒక పూల దండగా తయారు చేసే దారం లాంటిది హిందీ భాష అని అభివర్ణించారు. ఈ వేడుకల్లో రాజ్యసభ డిప్యూటీ చైర్మెన్ హరివంశ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అధికార భాషా విభాగం కార్యదర్శి అన్షులి ఆర్య తదితరులు పాల్గొన్నారు.

పేద బిడ్డల గుడులు సర్కారు బడులు

- పాఠశాలల్లో ఈ గుణాత్మక మార్పు భవిష్యత్ గమనానికి సంకేతం
- ఎక్స్‌లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో భారీ సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలు పొందుతుండడంపై ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన శుక్రవారం స్పందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. 'పదేండ్ల చీకట్లను పారదోలి ప్రభుత్వ పాఠశాలల్లో అక్షర జ్యోతులు వెలుగుతున్నాయి. పేద బిడ్డల చదువుల గుడులు అక్షర మంత్రోశ్చారణలతో పవిత్రతను సంతరించుకుంటున్నాయి. సర్కారు బడికి గత పాలకులు వేసిన తాళాలు బద్ధలవుతున్నాయి. పాఠశాలల్లో కనిపిస్తున్న ఈ గుణాత్మక మార్పు తెలంగాణ భవిష్యత్తు గమనానికి సంకేతం. ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ఇది నిదర్శనం. ఈ అక్షర యజ్ఞంలో చేతులు కలిపిన ప్రతి ఒక్కరికి అభినందనలు'అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు కొత్తగా 3,68,054 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ఇందులో 572 ప్రీప్రైమరీ పాఠశాలల్లో 6,146 మంది పిల్లలు చేరారు. ఒకటో తరగతిలో 1,38,135 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు.

రెవెన్యూ గ్రామానికి ఒక జిపిఒ

- మండలానికి 4 నుంచి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- 27న అర్హత పరీక్ష
- ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి : మంత్రి పొంగులేటి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసి భూ సమస్యలపై సామాన్యులకు మెరుగైన సేవలందించడానికి వీలుగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జిపిఒ, భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి నలుగురు నుంచి ఆరుగురు ల్యాండ్ సర్వేయర్లను నియమించబోతున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ఐఅండ్‌పిఆర్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ నెల 27న శిక్షణ పొందిన లైసెన్స్‌డ్ సర్వేయర్లకు తుది పరీక్ష నిర్వహిస్తామని, 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ఆగస్టు 12న తుది ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఉత్తీర్ణులైన వారికి 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణ ఉంటుందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో అందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. మొత్తం పదివేల మంది దరఖాస్తు చేసుకున్నారనీ, తొలివిడతలో ఏడు వేల మందికి 33 కేంద్రాల్లో మే 26న శిక్షణ ప్రారంభించామన్నారు. ఈ నెల 26తో 50 రోజుల శిక్షణ పూర్తికాబోతోందన్నారు. మిగిలిన మూడువేల మందికి ఆగస్టు రెండో వారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని చెప్పారు. గత పదేండ్లలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. రెవెన్యూ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంలో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక జిపిఒను నియమిస్తున్నామని తెలిపారు. వీఆర్వో, వీఆర్‌ఏ అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో అర్హత పరీక్ష నిర్వహించగా 3,554 మంది ఎంపికయ్యారని తెలిపారు. మరోసారి అవకాశం కల్పించాలన్న రెవెన్యూ సంఘాల అభ్యర్థన మేరకు ఈనెల 27న మరోసారి వారికి అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు.

ఐదు నక్షా గ్రామాల్లో రీసర్వే పూర్తి

రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలను గుర్తించామనీ, ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాల్లో రీసర్వేను విజయవంతం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నక్షాలేని గ్రామాలకు పరిష్కారం చూపాలన్న సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నక్షాలేని గ్రామాలను విస్మరించిందని విమర్శించారు. పైలెట్ గ్రామాలైన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలు, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామంలో 626 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడలో 845 ఎకరాలు, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్‌నగర్‌లో 593 ఎకరాలకు సర్వే పూర్తిచేశామని వివరించారు. మొత్తం ఐదు గ్రామాల్లోని 2988 ఎకరాల్లో చిన్న వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈసర్వే పూర్తి చేశామని చెప్పారు. దీని వల్ల భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందన్నారు. ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఈ సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కల్లు సీసాతో పొడిచి అన్నను చంపిన తమ్ముడు

- మంత్రాల నెపం, ఆర్థిక విషయాలే కారణం..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ సంబంధాలు మంట కలిసి పోతున్నాయనడానికి ఈ హత్యోదంతమే నిదర్శనం. మంత్రాల నెపం, ఆర్థిక విషయాలతో తమ్ముడు.. అన్నను హత్య చేసిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసానిపల్లి కల్లు డిపో వద్ద జరిగింది. సంఘటన జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షులు తీసిన వీడియో కొల్చారం మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. అంసాన్‌పల్లి వసురం తండాకు చెందిన రామావత్ మంఖ్య (45)కు అతని సోదరుడు మోహన్‌కు మధ్య గ్రామంలోని కల్లు డిపో వద్ద మంత్రాల నెపం, ట్రాక్టర్ అద్దె డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దాంతో మోహన్ కల్లు సీసాతో అన్నను మెడపై పొడిచి చంపాడు. చనిపోయిన తర్వాత కూడా మంఖ్య తలకు చేతి రుమాలుతో ఉరివేసి కిరాతకంగా కొట్టిన వీడియో మండలంలో వైరల్‌గా మారింది. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య సంతు, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్టు స్థానికులు తెలిపారు. ఘటన స్థలాన్ని మెదక్ రూరల్ సీఐ విజయకుమార్, కొల్చారం ఎస్ఐ మహమ్మద్‌లు సందర్శించారు.



మానవీయ సుగంధ పరిమళ ' గుప్పెడు గంధం '

ప్రజాశక్తి కల్చరల్

గుప్పెడు గంధంలో కథలు మానవీయ సుగంధ పరిమళాలు వెదజల్లుతాయని ప్రభుత్వ పూర్వ సాంస్కృతిక సలహాదారు డాక్టర్ కెవి రమణ అన్నారు. మసబ్ టాంక్‌లోని డాక్టర్ రమణ నివాస కార్యాలయంలో రావుల పుల్లా చారి రచించిన గుప్పెడు గంధం కథా సంపుటి ఆవిష్కరణ సభ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు తెలంగాణ భాష, ఆత్మ, లను కథల రూపం లో పుల్లాచారి ఆవిష్కరించారు అని అభినందించారు. ప్రతి కథా చిన్నయ సూరి నీతి చంద్రికలోని కథలవల్లె జంతువులను పాత్రలు చేసి కథలని పుల్లా చారి అల్లారు అని చెప్పారు. అధ్యక్షత వహించిన కేంద్రీయ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డిఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ , వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన పుల్లాచారి తన కథల సంపుటి మరో రచయిత రమణ కు అంకితం ఇవ్వటం సముచితం గా ఉందని చెప్పారు. సంపుటినీ సమీక్ష చేసిన ప్రముఖ విమర్శకుడు డాక్టర్ అమ్మంగి వేణు గోపాల్ రచయితలూ సృష్టి కర్తలు అన్నారు. వారూ పాత్రల్ని సృష్టి చేస్తారు అని చెప్పారు కథ కుప్తంగా పాటకుడు అనుభూతి పొందే విధంగా ఉండాలని, ఆ దృష్ట్యా గుప్పెడు గంధం కథలు వుంటాయి అని వివరించారు. కథలు బడుగు వర్గాల జీవితం తెలంగాణ నేపథ్యంలో చెప్పారని తెలిపారు. ప్రముఖ కవి పెద్దూరి వెంకట దాసు మాట్లాడుతూ హృదయానికి హత్తుకునే కథలు గుప్పెడు గంధంలో ఉన్నాయని ఉదాహరించారు. వేదిక పై డాక్టర్ పులికొండ సుబ్బా చారి, దయానంద చారి, డాక్టర్ మదన్ మోహన్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో యుపిఐటిఎస్ రోడ్ షో

ప్రజాశక్తి - హైదరాబాద్ : ఉత్తరప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన (యుపిఐటిఎస్) 2025 కోసం హైదరాబాద్‌లో రోడ్‌షో ఏర్పాటు చేసింది. శుక్రవారం ఎఫ్‌టిసిసిఐలో జరిగిన ఈ కార్యక్రమానికి 150 మందికిపై పైగా హాజరు కాగా.. యుపి ఎంఎస్ఎంఇ శాఖ మంత్రి రాకేష్ సచన్ హాజరై మాట్లాడారు. సెప్టెంబర్ 25-29 తేదిల్లో గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఈ ఎక్స్‌పో వివరాలను ఆయన వెల్లడించారు. ఇందులో బి2బి జోన్లు, కొనుగోలుదారులు, విక్రేతలు, ఎగుమతిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారన్నారు. ఎంఎస్ఎంఇలు, చేతి వృత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్, ఇవిలు, పునరుత్పాదన ఇంధన, వ్యవసాయ తదితర అనేక కంపెనీలు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించనున్నాయన్నారు. తదుపరి రోడ్‌షోలు బెంగళూరు, ముంబై, అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాకేష్ సచన్ తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్‌టిసిసిఐ అధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. ఇది దేశాభివృద్ధికి దోహదం చేయనుందన్నారు.

కల్తీ కల్లు విక్రయాన్ని అరికట్టాలి

- డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్తీకల్లు విక్రయాన్ని అరికట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్, ఉపాధ్యక్షులు ఎండీ జావిద్ శుక్రవారం హైదరాబాద్‌లోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సయ్యద్ ఖురేషికి వినతి పత్రాన్ని సమర్పించారు. కల్తీ కల్లు అమ్ముతున్న కాంపౌండ్ల నిర్వాహకులనూ, కాంట్రాక్టర్లను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాంటి కల్లు కాంపౌండ్లను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కల్తీ కల్లు ఘటనలు వరుసగా జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ధనార్జనే ధ్యేయంగా ఆ కాంపౌండ్ల నిర్వాహకులు పలు రసాయనాలతో కల్లును కల్తీచేసి అమ్ముతున్నారని, అది సేవించిన ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురై మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. ఘటనలు జరిగినప్పుడు హడావుడి చేయడం కాకుండా.. నిరంతర నిఘాను ఏర్పాటు చేయాలనీ, తనిఖీలు చేయాలని కోరారు. కూకట్‌పల్లి పరిధిలోని ఇందిరానగర్ బస్తికి చెందిన ఎనిమిది మంది నిరుపేదలు కల్తీ కల్లు తాగి మరణించడం విషాదకరమని తెలిపారు. ఇప్పటికే 44 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని గుర్తు చేశారు. ఈ ఘటనకు కారకులైన వారిపై హత్యా నేరం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలనీ, చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో కేవియట్ వేసి బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్ ఇవ్వాలి

- రిజర్వేషన్ల పెంపు బిల్లును గవర్నర్ ఆమోదించాలి
- దీనిపై బిజెపి రాష్ట్ర నేతలు చొరవ తీసుకోవాలి
- తాత్కాలికంగా రైల్ రోకో వాయిదా : కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే హైకోర్టులో కేవియట్ దాఖలు చేసి ఆర్డినెన్స్ జారీ చేయించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ (యుపిఎఫ్) నాయకులతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ అన్ని కుల సంఘాలను కలుపుకొని ఐక్య ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తేగా, రాష్ట్ర శాసనసభ, శాసన మండలిలో రెండు బిల్లులు ప్రవేశ పెట్టిందని తెలిపారు. అయితే ఆ బిల్లుల ఆమోదం కోసం కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదని ఆమె ఆక్షేపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 17న రైల్ రోకోకు పిలుపునిచ్చినట్టు గుర్తుచేశారు. ప్రజల్లో కాంగ్రెస్, బీజేపీల వైఖరి ఎండగట్టడంతో ఒత్తిడికి తలొగ్గి క్యాబినెట్‌లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తూ చట్ట సవరణ చేసిందని తెలిపారు. ఇది తెలంగాణ జాగృతి సాధించిన విజయమని తెలిపారు. సవరణ బిల్లును గవర్నర్ ఆమోదించేలా బీజేపీ నాయకులు ఒత్తిడి పెంచాలని కోరారు. బిసి రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తెస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో తాము పిలుపునిచ్చిన రైల్ రోకోను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. గవర్నర్ సవరణ బిల్లుకు ఆమోదం తెలిపి ఆర్డినెన్స్ జారీ చేయకపోతే మళ్లీ ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదన మాత్రమే చేశారనీ, విద్య, ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు కల్పించే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

భౌతిక దాడులు చేస్తే ఊరుకునేది లేదు

- సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భౌతిక దాడులు చేస్తే ఊరుకునేది లేదని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి డివిజన్ బసవతారక నగర్ గుడిసె వాసుల ధర్నా శిబిరాన్ని సిపిఎం నాయకులు శుక్రవారం సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిలోని గోపనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 36లో 460 ఎకరాలు, 37లో 424 ఎకరాలు కలిపి మొత్తం 884 ఎకరాల పోరంబోకు భూమి ఉందన్నారు. ఈ భూమిలోని ఐదారు ఎకరాల్లో 40 ఏళ్ల నుంచి పేదలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని తెలిపారు. వీరిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిగా గుర్తించి ఆ గుడిసెలకి ఇంటి నెంబర్లు, విద్యుత్ కనెక్షన్లు, వాటర్ కనెక్షన్లను జీహెచ్ఎంసీ వాళ్లే పర్మిషన్లు ఇచ్చారని తెలిపారు. అలాగే, రేషన్‌కార్డులు, ఓటర్ లిస్టులు, అధార్‌కార్డులు కూడా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అయితే ఆ భూమి పైన పెట్టుబడుదారులు, కార్పొరేట్లు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై రికార్డులను తారుమారు చేసి ప్రయివేటు భూమిగా రికార్డులు సృష్టించారన్నారు. తప్పుడు రికార్డులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోకుండా, పేదలపై దాడి చేసేందుకు ప్రయివేటు సైన్యాన్ని దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా దర్యాప్తు జరిపి దాడులు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇక్కడ నివసిస్తున్న పేదలకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామెల్, డి.జగదీశ్, జిల్లా కమిటీ సభ్యులు సి.శోభన్, మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు కె.కృష్ణ, రజాక్ పాషా, సీపీఐ నాయకులు చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గుడిసె వాసులతో మాట్లాడుతున్న పగడాల యాదయ్య

ప్రతిపక్ష నాయకుని హోదాలో సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి : బీఆర్ఎస్ నాయకులు

గతంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ స్పీకర్ మధుసూధనాచారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలిలోని గోపన్‌పల్లి బసవతారక నగర్ వాసులను బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రియల్ మాఫియా పెద్దలు ప్రభుత్వ భూమిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే బసవతారక నగర్ కాలనీ వాసులను ఖాళీ చేయించడానికి గుండాలను పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బసవతారక నగర్ కాలనీని సందర్శించి వారికి 60 గజాల స్థలం ఇస్తామని హామీనిచ్చారని, ఆ హామీకి కట్టుబడి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. బసవతారక నగర్ పక్కనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. లేకపోతే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- మంత్రులు కోమటిరెడ్డి, దామోదర రాజ నర్సింహ, జూపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు పాల్గొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రూ.12.70 కోట్లతో నిర్మించబోయే 30 పడకల ఆస్పత్రి భవనానికి, కోనాపూర్ నుంచి మాడ్గుల వరకు, మాడ్గుల నుంచి దేవరకొండ రోడ్డు వరకు రూ.70 కోట్ల వ్యయంతో నిర్మించే బీటీ (డబుల్ లైన్) రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులకు పూర్ణకుంభంతో పలువురు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్, జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ, మాజీ కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో భాగంగా మాడ్గుల వద్ద కోనాపూర్ నుంచి దేవరకొండ వరకు డబుల్ లైన్ రోడ్ పనులకు, మాడ్గుల మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. బిసి కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లను అమలుచేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అనంతరం మాడ్గుల మండలంలోని 220 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు మంత్రులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు చైర్మన్ బాలాజీ సింగ్, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వేంకటేశ్వర రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఆర్అండ్‌బీ అధికారులు, సంబంధిత అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చదరంగంలో ఎనిమిదేళ్ల నిర్వి అసమాన ప్రతిభ

ప్రజాశక్తి - హైదరాబాద్



చదరంగంలో ఎనిమిదేళ్ల చిన్నారి నిర్వి ప్రద్యుమ్నా 50కి పైగా చదరంగపు ఓపెనింగ్ ట్రాప్స్‌ను 50కి పైగా బోర్డులపై అత్యల్ప 30 నిమిషాల సమయంలో ప్రదర్శించి ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా 195 దేశాల అధికారిక కరెన్సీలను కేవలం 4నిమిషాల 26 సెకండ్లలో గుర్తించి పేర్లు చెప్పింది. కూకట్‌పల్లిలోని అశోక వన్ మాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఒకే ఈవెంట్‌లో ఇంతవరకు లేని రెండు ప్రపంచ రికార్డులను ప్రయత్నించడం ద్వారా, నిర్వి చదరంగం మరియు ప్రపంచ జ్ఞానంలో తన అసాధారణ ప్రతిభను చూపించింది. ఈ కార్యక్రమానికి హాజరైన జాతీయ సీనియర్ చెస్ అర్బిటర్ ఉజ్వల్ చౌహాన్, నిర్వి విజయవంతంగా ప్రదర్శించిన ప్రతిభను ధ్రువీకరించి లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపారు.

శ్రీలంకలో ఫాల్కన్ పుంప్స్ డీలర్స్ కాన్ఫరెన్స్ ఏర్పాటు



ప్రజాశక్తి - హైదరాబాద్ : ప్రముఖ బోరు పంపులు, ఉపకరణాల కంపెనీ ఫాల్కన్ పుంప్స్ ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్‌ల ఆధ్వర్యంలో శ్రీలంకలో ఇంటర్నేషనల్ డీలర్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ కాన్ఫరెన్స్‌లో ఫాల్కన్ గ్రూప్స్ వారి నూతన ఉత్పాదనలు, టెక్నికల్ నవీకరణల గూర్చి వివరించడం జరిగిందని ఆ సంస్థ పేర్కొంది. ఈ కాన్ఫరెన్స్ నందు బిజినెస్ లక్ష్యాన్ని చేరిన ప్రతీ డీలర్‌ను అవార్డ్‌తో ఘనంగా సత్కరించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఫాల్కన్ పంప్స్ చైర్మన్ భార్గవ్ సువాగియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమల్ నయన్ సోజిత్ర, ఫాల్కన్ కేబుల్స్ డైరెక్టర్ పారస్ శింగాల, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్ నల్లపాటి బసంత్ గుప్తా, రత్న ఇంజనీరింగ్ కార్పొరేషన్ ఎండి కళ్యాణ్ గుప్తా నల్లపాటి, రెండు రాష్ట్రాల డీలర్స్, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో మరో 18 దత్తత కేంద్రాలు

- ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మరో 18 ప్రత్యేక దత్తత కేంద్రాలు, రెండు బాలల సంరక్షణ కేంద్రాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. దానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు పూర్తి కాగా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఆ ఫైల్‌పై శుక్రవారం సంతకం చేశారు. సీఎం ఆమోదం లభించిన వెంటనే ఈ కేంద్రాల ఏర్పాటుకు అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం శిశు సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. అనాథలు, తల్లిదండ్రులు వదిలి వేసిన పిల్లలను దత్తత కేంద్రాల్లో సంరక్షిస్తూ వారికి అన్ని అవసరాలను అందించడంతో పాటు, నిబంధనల ప్రకారం దత్తత ఇచ్చే ప్రక్రియను సర్కారు చేపడుతున్నది. ప్రస్తుతం రాష్ట్రంలో 15 జిల్లాల్లో 17 దత్తత కేంద్రాలున్నాయి. వాటికి అదనంగా 18 కొత్త కేంద్రాల ఏర్పాటుతో మొత్తం దత్తత కేంద్రాల సంఖ్య 35కి చేరనుంది. పిల్లల అక్రమ విక్రయాలు, అనధికార దత్తతలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నది. దత్తతను చట్టం బద్ధంగా తీసుకునే వెసులుబాటును కల్పించేందుకు దత్తత కేంద్రాలు దోహదపడనున్నాయి. ఈ ప్రణాళికల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది.

డ్రీమ్ ఎఫ్10 రోబోట్ వాక్యూమ్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : డ్రీమ్ టెక్నాలజీ ఇండియా కొత్తగా డ్రీమ్ ఎఫ్10 రోబోట్ వాక్యూమ్‌ను ఆవిష్కరించినట్లు తెలిపింది. 13,000 పిఎ శక్తివంతమైన సక్షన్, స్మార్ట్ మ్యాపింగ్, కార్పెట్ బూస్ట్‌తో భారతీయ ఇళ్లకు అనుగుణంగా దీన్ని డిజైన్ చేసినట్లు ఆ కంపెనీ ఎండి మను శర్మ పేర్కొన్నారు. 5200 ఎంఎహెచ్ బ్యాటరీ కలిగిన ఇది 300 నిమిషాల వరకు రన్‌టైమ్‌ను అందిస్తుందన్నారు. అమెజాన్ ప్రైమ్ డే సేల్‌లో రూ.19,999 ప్రత్యేక ధరకు అందిస్తున్నామన్నారు.

కాళేశ్వరం కమిషన్‌ను సర్కారు తప్పదోవ పట్టిస్తోంది

- హరీశ్‌రావు విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: కాళేశ్వరం మీద ఏర్పాటైన పిసి ఘోష్ కమిషన్‌ను కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తున్నదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం పిసి ఘోష్ కమిషన్‌కు అదనపు సమాచారం అందించిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ కమిషన్‌ను కలిసి అదనపు సమాచారం అందించినట్టు చెప్పారు. కమిషన్ నిన్న సమయం ఇచ్చిందనీ, నిన్న కెసిఆర్‌కు వైద్య పరీక్షలు ఉన్న నేపథ్యంలో రాలేకపోతున్నానని కమిషన్‌ను రిక్వెస్ట్ చేయగా అంగీకరించినట్టు చెప్పారు. వారిచ్చిన సమయం ప్రకారం, శుక్రవారం కమిషన్‌ను కలిసి మా వద్ద ఉన్న అదనపు సమాచారం అందించామన్నారు. మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను దష్టిలో పెట్టుకొని మా వద్ద ఉన్నంత మేరకు కమిషన్‌కు స్పష్టమైన సమాచారం ఇచ్చామన్నారు. మేం ఇప్పుడు ప్రభుత్వంలో లేము. డాక్యుమెంట్స్ అన్ని ప్రభుత్వం వద్ద ఉంటాయి. సమాచారం కోసం చీఫ్ సెక్రెటరీ, జీఏడీ సెక్రెటరీ, ఇరిగేషన్ సెక్రెట్రరీ గారికి లేఖ రాశాను. ఆ రోజుల్లో తీసుకున్న క్యాబినెట్ నిర్ణయాలు, క్యాబినెట్ నోట్ వంటి సమాచారం కావాలని లేఖల రూపంలో అడిగాను. కాని వారి నుంచి స్పందన రావడం లేదు. మా వద్ద అందుబాటులో ఉన్న సమాచారం క్రోడీకరించి నివేదిక రూపంలో ఇవ్వడం జరిగింది. మా సమాచారం అధారంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి ఆరు సార్లు క్యాబినెట్ నిర్ణయాలు జరిగాయి. ఆరు సార్లు క్యాబినెట్ ఆమోదం పొందిన డాక్యుమెంట్లు కమిషన్‌కు అందించాం. అంతే కాదు మూడు సార్లు శాసనసభ ఆమోదం కూడా పొందింది. ఎప్పుడెప్పుడు జరిగాయి, జరిగిన చర్చ, ఇతర అంశాలను కమిషన్‌కు అందించాం. లెజిస్లేచర్ అప్రూవల్ క్యాబినెట్ కంటే కూడా ఉత్తమం అయినటువంటిది. ఆరు సార్లు క్యాబినెట్ అప్రూవల్ వివరాలను, మూడు సార్లు అసెంబ్లీ ఆమోదం, చర్చ వివరాలను కమిషన్‌కు డాక్యుమెంట్లతో సహా అందించామని హరీశ్‌రావు తెలిపారు. కమిషన్ ఆన్ గోయింగ్ కనుక ఆ వివరాలు బయట పెట్టలేను. సందర్భం వచ్చినప్పుడు పూర్తిగా ఆ వివరాలు బయట పెడతాం.ఇంతకు మించిన వివరాలు ఉన్నాయి, కానీ ప్రభుత్వం మాకు అడిగినా ఇవ్వడం లేదు. కమిషన్‌కు అందించిన సమాచారం మాకు ఇవ్వాలని అడిగితే ప్రభుత్వం ఇవ్వడం లేదు. పారదర్శకంగా ఉండాలనుకుంటే మాకు ఆ వివరాలు ఎందుకు ఇవ్వడం లేదని హరీశరావు ప్రశ్నించారు. ప్రజాభవన్‌లో జరిగింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదనీ, కాంగ్రెస్ తెలంగాణకు 50 ఏండ్లుగా చేసిన మోసాలకు కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని విమర్శించారు.

ఆస్పత్రుల్లోనే కల్తీ కల్లు బాధితులు

- 'నిమ్స్'లో 34.. 'గాంధీ'లో 19 మందికి చికిత్స
- ఘటనపై కొనసాగుతున్న 'ఎక్సైజ్' విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన బాధితులకు ఆస్పత్రుల్లో చికిత్స కొనసాగుతోంది. పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో 34 మంది, సికింద్రాబాద్ గాంధీలో 19 మంది చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో చేరిన వారిలో 11 మందికి డయాలసిస్ అందిస్తుండగా.. మరో ఇద్దరికి డయాలసిస్ అవసరం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. 11 మంది పూర్తిగా కోలుకున్నారు. 12 మంది వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. నిపుణులైన మల్టీస్పెషాల్టీ వైద్య బృందం నిశితంగా పర్యవేక్షిస్తోంది.

బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓపై సస్పెన్షన్

కూకట్‌పల్లి కల్తీ కల్లు వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ చర్యలు చేపట్టింది. బాలానగర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ వేణుకుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. డిటిఎఫ్ నర్సిరెడ్డి, ఏఈఎస్ మాధవయ్య, ఎస్ఈ ఫయాజ్, ఏఈఎస్ జీవణ్‌కిరణ్ పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. కాగా, కూకట్‌పల్లిలోని పలు కల్లు దుకాణాల నుంచి అధికారులు నమూనాలు సేకరించారు. వాటిని ల్యాబ్‌లో పరీక్షించగా.. కాంపౌండ్‌లో సేకరించిన కల్లులో కెమికల్స్ ఉన్నట్టు గుర్తించారు. రసాయనాలు కలిపిన కల్లు తాగడం వల్లే కూకట్‌పల్లి ప్రాంతంలోని పలువురు అస్వస్థతకు గురైనట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.

బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆరా

నిమ్స్, గాంధీ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. నిమ్స్, గాంధీ డాక్టర్లు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లు మంత్రికి వివరించారు. ప్రస్తుతం నిమ్స్‌లో 35 మంది, గాంధీలో 18 మంది చికిత్స పొందుతున్నారని అధికారులు మంత్రికి తెలిపారు. నిమ్స్‌లో ఉన్న 35 మందిలో ఐదుగురిని శుక్రవారం డిశ్చార్జ్ చేస్తున్నామని డైరెక్టర్ బీరప్ప వెల్లడించారు. మిగిలిన 30 మందికి చికిత్స కొనసాగిస్తున్నామని వివరించారు. గాంధీలో ఉన్న 18 మందిలో నలుగురు డయాలసిస్‌పై ఉన్నారని డాక్టర్లు తెలిపారు. మిగిలిన 14 మంది పేషెంట్ల పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు. వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు, డాక్టర్లకు మంత్రి సూచించారు. పూర్తిగా కోలుకునే వరకూ ఆస్పత్రుల్లోనే ఉంచాలని, ఆ తర్వాతే డిశ్చార్జ్ చేయాలని ఆదేశించారు.



మహేష్ బ్యాంక్ డివిడెండ్ 22 శాతం

2024-25లో రూ.70 కోట్ల లాభాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ గడిచిన ఆర్థిక సంవత్సరం 2024-25లో తన వాటాదారులకు 22 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. గడిచిన ఏడాదిలో ఈ సంస్థ పన్నులు చెల్లించక ముందు రూ.69.98 కోట్ల రికార్డ్ లాభాలను నమోదు చేయగా.. పన్నులు చెల్లించన తర్వాత రూ.53.61 కోట్ల నికర లాభాలు సాధించింది. బంజారాహిల్స్‌లోని ఆ బ్యాంక్ హెడ్ ఆఫీసులో 49వ వార్షిక సాధారణ సభ్య సమావేశం జరిగింది. ఆ బ్యాంక్‌కు హైకోర్టు నుంచి స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన రామ్ నారాయణ బోగ విచ్చేసి మాట్లాడుతూ.. భవిష్యత్తులను బ్యాంక్ వ్యాపారం మరింత పెరగాలని సూచించారు. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు రూ.48.58 కోట్ల నుంచి రూ.38.68 కోట్లకు తగ్గాయి. దీంతో స్థూల ఎన్‌పిఎలు 4.52 శాతంగా ఉండగా.. నికర ఎన్‌పిఎలు సున్నా శాతంగా నమోదయ్యాయి. బ్యాంక్ ఛైర్మన్ రమేష్ కుమార్ బంగ్ మాట్లాడుతూ.. 2025-26లో రూ.3,175 కోట్ల వ్యాపారాన్ని చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతమున్న బ్యాంక్ శాఖలను 45 నుంచి 50కి పెంచుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. ఈ సమావేశానికి ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ వి అర్విండ్, వైస్ ఛైర్మన్ లక్ష్మీ నారాయన్ రతి, డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.